నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | గురువారం 6 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

షట్‌పల్లిలో తాగు నీటి తిప్పలు

బుధవారం ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న షట్‌పల్లి గ్రామ మహిళలు

కోటపల్లి మండలం షట్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు తాగు నీటికోసం అష్టకష్టాలు పడుతున్నారు. బోరు బావి పనిచేయక.. మిషన్ భగీరథ నీరు రాక తిప్పలు తప్పడం లేదు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తుండగా, పనులన్నీ వదులుకొని ఎదురుచూడాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారులో బోరు బావి నిర్మించగా, రంబి లేకుండేనని, ప్రస్తుతం అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంతో బిందెడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని వారు చెబుతున్నారు. ఇకనైనా వేసవిని దృష్టిలో పెట్టుకొని తమ గోస తీర్చాలని వారు వేడుకుంటున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మహ్మద్ యెన్నంను వివరణ కోరగా తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

- కోటపల్లి, మార్చి 5

కాంగ్రెస్ తెచ్చిన కరువు

అన్నదాత ఆరాగాన

అందని గూడెం లిఫ్ట్, కడెం కాలువల నీళ్లు

- అడుగంటిన భూగర్భ జలాలు
- పొట్టకొస్తున్న దశలో ఎండుతున్న పంటలు
- బోరేస్తే పడలేదని.. బావి తవ్విస్తున్న యువరైతు చందు
- ఎకరంన్నర కోసం రూ. 4 లక్షల దాకా ఖర్చు
- ముక్కాసిగూడలో అగమ్యగోచరంగా రైతుల పరిస్థితి
- మరో వారం పది రోజుల్లో ఎడారిగా మారనున్న పొలాలు

కోటి ఆశలతో వరి సాగు చేసిన ముక్కాసిగూడ రైతాంగానికి చివరకు నిరాశే మిగులుతున్నది. గూడెం లిఫ్ట్ పెద్ద కాలువ, కడెం ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా నీరందక.. భూగర్భ జలాలు అడుగంటి పాట్ట దశకు వస్తున్న వరి కళ్లముందే ఎండిపోతుండగా, దిక్కుతోచని పరిస్థితి నెలకొన్నది.

- మంచిర్యాల, మార్చి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ముక్కాసిగూడలో బావి తవ్విస్తున్న రైతు గంతుల చందు

ఎండిపోయిన పొలాన్ని చూపిస్తున్న గంతుల చందు

ఈ చిత్రంలో ఎండిపోయిన పొలాన్ని చూపిస్తున్న యువరైతు పేరు గంతుల చందు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముక్కాసిగూడ గ్రామస్తుడు. మంచిర్యాల జిల్లాలోని గూడెం లిఫ్ట్ పెద్ద కాలువ, కడెం ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా నీళ్లొస్తయని ఆశపడి ఎకరంన్నరలో వరిసాగు చేసిండు. ఈ కాలువల నీళ్లు చుట్టుపక్కనున్న ఊర్లలోకి వచ్చినా చాలు.. ఊట ఉంటదనుకున్నడు. ఒర్రెలో పొక్లెయిన్‌తో గుంత చేసి పొలం పారిస్తననుకున్నడు. కానీ, గత యాసంగి సీజన్ మాదిరిగానే ఈ సీజన్‌లోనూ అటు పెద్దకాలువ నీళ్లు, ఇటు కడెం నీళ్లు చుట్టుపక్కనున్న ఊళ్లలోకి రాలేదు. దీంతో పోయినేడు మాదిరిగానే ఈ ఏడాది కూడా కండ్ల ముందే పంట ఎండిపోతుంటే చూడలేక రూ.రెండు లక్షలు పెట్టి బావి తవ్విస్తున్నడు. గతేడాదే రూ.రెండు లక్షలు ఖర్చు చేసి బోర్ వేయిస్తే అది ఫెయిలైంది. సరిపడా నీళ్లు రాక పోయినేడు పంట చేతికిరాలేదు. అందుకే ఈసారి బావి తవ్విస్తున్నడు. అంటే రెండేళ్లలో ఎకన్నరం పొలం కోసం రూ.నాలుగు లక్షల దాకా ఖర్చు పెట్టిండు. పోనీ, ఈ ఏడాదైనా బావి తవ్వితే నీళ్లొస్తయనుకుంటే ఇప్పటికే పంటంతా వల్లిపోయింది. ఇప్పుడు నీరు పెట్టినా చేతికొస్తదన్న గ్యారంటీ లేదంటూ చందు నిట్టూర్చాడు. ఇలా ఈ ఒక్క రైతే కాదు.. ముక్కాసిగూడలో అనేక మంది తీవ్రంగా నష్టపోయే దుస్థితి దాపురించింది.

చెరువులు నింపకే ఎండుతున్న పంటలు..

దండేపల్లి మండలం ముక్కాసిగూడ రైతులకు యాసంగి సాగు నీళ్లు రావాలంటే వానకాలంలో కడెం డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నుంచి వచ్చే నీటితో అల్లీపూర్ చెరువును నింపాలి. కానీ, ఈ ఏడాది వానకాలంలో చెరువును నింపలేదని రైతులు చెబుతున్నారు. అల్లీపూర్ చెరువు నిండితే వానకాలం సాగు చేసేటోళ్లం. ఎండాకాలం కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువ నీళ్లు తాళ్లపేట, మాకులపేట వరకు వస్తే అల్లీపూర్ చెరువులో కొంత నీరు ఉండి మా ఒర్రెలో ఊట వస్తుండే. కానీ ఇప్పుడు జన్నారం మండలం తపాల్‌పూర్ వరకే కడెం నీళ్లు వస్తున్నయ్. అది కూడా 15 రోజులు ఇస్తున్నరు, 15 రోజులు బంద్ చేస్తున్నరు. మా ఊరు దాకా అవి చేరడం లేదు. పోనీ ఇటు పక్కనున్న గూడెం లిఫ్ట్ నీళ్లైనా వస్తాయనుకుంటే అవి మ్యాదర్‌పేట్, మామిడిపల్లి వరకే వస్తున్నయ్. అట్లా కాకుండా తాళ్లపేట దాకా ఆ నీరు వస్తే అట్లనన్న ఒర్రెలో ఊట వస్తుండే... దాన్నే తోడుకొని సాగు చేసేటోళ్లం. దాదాపు రెండు సీజన్‌లుగా ఆ పరిస్థితి లేదు. అందుకే మా పంటలు ఎండిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే వారం, పది రోజుల్లో పంటలు పూర్తిగా ఎండిపోతాయని వాపోతున్నారు. దాదాపు 50 ఎకరాలు నీరు లేక ఎండిపోయి ఎడారి అయిపోతాయంటున్నారు. ప్రస్తుతం అల్లీపూర్ చెరువులో కొంత నీరున్నా.. అవి తూము ఎత్తు కంటే దిగువకు ఉన్నాయని, తూములో నుంచి బయటికి వచ్చే నీళ్లు లేవని, చెరువులో పంప్ వేసి తీద్దామంటే చేపలు పెంచేటోళ్లు ఒప్పుకోవడం లేదంటున్నారు. కడెం నీళ్ల మా ఊరు దాకా వచ్చేలా చేయాలంటూ వేడుకుంటున్నారు. గతంలో మాదిరిగా వానకాలంలో చుట్టుపక్కనున్న చెరువులు నింపకపోవడం వల్లే పంటలు ఎండిపోతున్నాయంటూ రైతులు చెప్పుకొస్తున్నారు.

పాదముద్రలు గుర్తిస్తున్న అటవీ శాఖ అధికారులు

పాత మంచిర్యాలలో పులి కలకలం!

అటవీ కుక్కల పాదముద్రలని నిర్ధారించిన అధికారులు

మంచిర్యాల అర్బన్, మార్చి 5 : పాత మంచిర్యాల శివారులో పులి అడుగులు కనిపించాయన్న వార్త బుధవారం కలకలం రేపింది. ఓ రైతు పులిని చూశానంటూ చెప్పడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇది వాట్సప్ గ్రూపుల్లో వైరల్ కాగా, స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పాదముద్రలను గుర్తించారు. అవి పులి పాదముద్రలు కావని, అటవీ కుక్కలవని నిర్ధారించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

మారుమూల గ్రామాలకు బైక్‌లపై వెళ్తున్న ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ, ఎస్ఐ పోలీసులు

మావోయిస్టులకు సహకరించవద్దు

- ఏఎస్పీ చిత్తరంజన్
- మారుమూల ప్రాంతాల్లో పర్యటన

కెరమెరి, మార్చి 5 : మావోయిస్టులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి సహకరించవద్దని ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ పేర్కొన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బుధవారం కెరమెరి మండలంలోని మారూమూల గ్రామాలైన టోకెన్ మోవడ్, చాల్‌బాడి, పాటగూడ, పిట్టగూడలో బైక్‌లపై పర్యటించారు. ఏఎస్పీ మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. రైతులు గంజాయి సాగు చేయవద్దని సూచించారు. విద్యుత్ తీగలు అమర్చి అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సీఐ సత్యనారాయణ, కెరమెరి ఎస్ఐ విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కడ జీతాలు పెరిగె మరి ఇక్కడేమాయె..?!

ఆర్‌జీ-1, ఆర్‌జీ-2 ఓసీపీల్లోని కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు

- ఓబీ కంపెనీలు, సంస్థ అధికారులతో చర్చించి ఒప్పందానికి కృషి చేసిన రామగుండం ఎమ్మెల్యే
- మంచిర్యాల జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలున్నా నోరుమెదపని వైనం
- ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక మల్లగుల్లాలు పడుతున్న కాంగ్రెస్ శాసనసభ్యులు
- ఇకనైనా సీరియస్‌గా తీసుకుంటారో లేదోనంటున్న కార్మికులు

మంచిర్యాల, మార్చి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రామగుండం పరిధిలోని ఓసీపీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెరగగా, మంచిర్యాల జిల్లాలో మాత్రం పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆ వర్గం మండిపడుతున్నది. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఓబీ కాంట్రాక్ట్, సింగరేణి అధికారులతో చర్చించి జీతాల పెంపుపై ఒప్పందం చేయించగా, ఇక్కడ ముగ్గురు ఎమ్మెల్యేలున్నా నోరుమెదపడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి.. ఇప్పుడెందుకు చొరవ చూపడం లేదంటూ ప్రశ్నిస్తున్నది.

ఆర్‌జీ-1, ఆర్‌జీ-2 ఓసీపీ కార్మికులకు..

రామగుండం పరిధిలోని ఆర్‌జీ-1, ఆర్‌జీ-2 ఓసీపీల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచారు. ఓసీపీల్లో ఓబీ కాంట్రాక్ట్ సంస్థలు, సింగరేణి అధికారులతో మాట్లాడి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాగూర్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు ఒప్పందం చేయించారు. ప్రస్తుతం ఓసీపీల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు బేసిక్ వేతనం రూ.20వేలపై రూ.2800 పెంచారు. హెల్పర్లకు ఇప్పుడున్న బేసిక్ మీద రూ.1680 పెంచారు. మిగిలిన వారికి రేషియో ప్రకారం పెంచేందుకు ఓబీ కంపెనీ అంగీకరించింది. రామగుండం ఎమ్మెల్యే ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంచిర్యాల జిల్లా మంచిర్యాల నియోజకవర్గంలో శ్రీరాంపూర్ ఓసీపీ, చెన్నూర్ నియోజకవర్గంలో ఇందారం, మందమర్రి, ఆర్‌కేపీ ఓసీపీలు ఉన్నాయి. బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో ఖైరిగూడ ఓసీపీ ఉంది. రామగుండం ఓసీపీల్లో మాదిరిగానే మంచిర్యాల జిల్లాలోని ఓసీపీల్లో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. రామగుండంలో కార్మికులకు వేతనాలు పెంచినట్లు మంచిర్యాలలో ఎందుకు పెంచడం లేదు.. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యేలు ఎందుకు చొరవ తీసుకోవడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల్లో గెలవడం కోసం అనేక హామీలిచ్చి.. ఎమ్మెల్యేలుగా గెలిచాక సింగరేణి కార్మికులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొరుగున ఉన్న రామగుండంలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచినట్లే మంచిర్యాల జిల్లాలోని అన్ని ఓసీపీల్లో కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచేందుకు స్థానిక ఎమ్మెల్యేలు కూడా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొండంత రాగం.. చేసింది శూన్యం..

మంచిర్యాల జిల్లా అంటేనే సింగరేణి కార్మికుల అడ్డా... అలాంటి కార్మికులకు ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ ఎన్నికల సమయంలో శ్రీరాంపూర్ ఓసీపీలో ఇప్పటి వరకు ఏదైతో నష్టం జరిగిందో వడ్డీతో సహా సింగరేణి నుంచి వసూలు చేయిస్తామన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్లాట్లు, భూములు కోల్పోయిన వారికి డబ్బులు ఇప్పిస్తామన్నారు. ఇది చెప్పి ఏడాది దాటిపోయినా.. ఇప్పటికీ ఎవరికీ రూపాయి రాలేదు. పెండింగ్‌లో ఉన్న ఇండ్ల పట్టాలు ప్రతిపాదన అటకెక్కింది. మొన్నటికి మొన్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్‌కార్డుల హామీ సైతం నెరవేరలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు9 స్థానిక ఎమ్మెల్యే ఈ విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పష్టమైన హామీ రాలేదు. ఇక బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్థానికంగా అందుబాటులో ఉండడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సింగరేణి పట్టాలు ఇప్పిస్తానని మాట ఇచ్చారు. ఈ రెండెంటిలో ఏదీ నెరవేర్చలేదు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ చెన్నూర్ సింగరేణి గనుల సంఖ్యను పెంచి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తానంటూ గప్పాలు కొట్టారు. ఆయన సైతం ఈ హామీ మర్చిపోయారు. కొండంత రాగం తీసి ఇచ్చిన హామీలు ఎలాగూ అమలు చేయలేకపోయారు. కనీసం పక్క జిల్లా ఎమ్మెల్యే ఇప్పించినట్లు మంచిర్యాల జిల్లాలోని ఓసీపీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలైనా పెంచేందుకు స్థానిక ఎమ్మెల్యేలు కృషి చేయాలంటూ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ విషయాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికైనా సీరియస్‌గా తీసుకుంటారా.. లేదా అన్నది తేలాల్సి ఉన్నది.

హామీ నెరవేర్చాలి

- పాగాకు రమేశ్, టీబీజీకేఎస్ కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి

జేబీసీసీఐ అగ్రిమెంట్ ప్రకారం ఓసీపీల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులకు ఫస్ట్ కేటగిరీ వేతనాలు ఇవ్వాలి. కానీ సింగరేణిలో ఇవ్వడం లేదు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ జేబీసీసీఐ ప్రకారం వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఏడాదిన్నరగా దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఒక దగ్గర కార్మికుల వేతనాలు పెంచి, మరో దగ్గర పెంచకపోవడం సరికాదు. సింగరేణి యాజమాన్యం ఇందులో కలగజేసుకోవాలి. కార్మికులకు చట్ట ప్రకారం రావాల్సిన వేతనాలు థర్డ్ పార్టీ మేనేజ్‌మెంట్ కింద చెల్లించి, ఓబీ కాంట్రాక్టర్లకు ఇచ్చే బిల్లుల్లో ఆ సొమ్మును రికవరీ చేసుకోవాలి.

జైపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల (ఏసీసీ), మార్చి 5 : ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం 23 కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొదటి రోజు జనరల్ పరీక్షకు 5,697 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 5,472మంది హాజరయ్యారని, ఒకేషనల్ పరీక్షకు 668 మంది హాజరు కావాల్సి ఉండగా, 606 మంది పరీక్ష రాశారన్నారు.

జైపూర్, మార్చి 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోపరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి బుధవారం సందర్శించారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జైపూర్ పరీక్ష కేంద్రంలో మొదటిరోజు 247 మంది విద్యార్థులకుగాను, 239 మంది పరీక్షకు హాజరైనట్లు సూపరింటెండెంట్ బండి ప్రసాద్ తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 5 : అధికారులు సమన్వయంతో పనిచేసి ఇంటర్ పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 166 బీఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉందని, జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని ఆదేశించారు. ఎస్పీ ఈఐ రాణా ప్రతాప్, ఆసిఫాబాద్ పట్టణ సీఐ రవీందర్ ఉన్నారు.

మొదటి రోజు ప్రశాంతం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 5 : జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్, ఒకేషనల్ గ్రూప్ మొత్తం 5,076 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 4,828 మంది హాజరైనట్లు డీఐఈవో కళ్యాణి తెలిపారు.

మూడో ప్లాంట్ ప్రారంభానికి సిద్ధంగా ఉండాలి

సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణ రావు

జైపూర్, మార్చి 5 : ఎస్టీపీపీలో మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి అధికారులు సిద్ధంగా ఉండాలని సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణ రావు పేర్కొన్నారు. బుధవారం జైపూర్‌లోని ఎస్టీపీపీలో గల మూడో ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి అన్ని అనుమతులు వచ్చాయని, త్వరలో భూమిపూజ కార్యక్రమ తేదీని అధికారికంగా వెల్లడిస్తామన్నారు. అనంతరం ప్లాంట్‌ను సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకతకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్టీపీపీలో డీజీఎం ఫైనాన్స్‌గా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన సుధాకర్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు, చీఫ్‌ఆఫ్‌వోఅండ్ఎం జైన్‌సింగ్, ఏజీఎం సివిల్ ప్రసాద్, డీజీఎం ఆపరేషన్స్ వేణుగోపాల్‌రావు, సీఎంవోఏఐ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, మేనేజర్ చంద్రమణి పాల్గొన్నారు.